
# 15

వివనమూర్తి



'మా వాడూ సమాజ ఉద్ధరణ చేస్తున్నాడు' అంది రాధ.

అంటున్నప్పుడు రాధ నవ్వాలి. ఆ నవ్వులో కాస్తంత గర్వం. కించిత్తు వెటకారం ఉండాలి. అప్పుడే రాధ దూ దగ్గర తీసిన దీర్ఘానికి అలంకారం ఏర్పడుతుంది.

కాని రాధ నవ్వదు. సమయప్రభావం.

నేనైతే ఆ నవ్వు కోసం ఎదురుచూసిన క్షణాలు, రోజులు, ఏళ్లూ ఉన్నాయి. వాటిని పువ్వులుగా చేసుకుని హృదయమంతా అలంకరించుకోవాలన్న రోజులు ఉన్నాయి.

ఇప్పుడు.. ఈ వయసులో... నాకటువంటి రొమాంటిక్ భావనలు లేవు.

శారద పోయాక కనీసం అలాంటివి కలిగినా బావుండునన్న వెర్రి ఊహ కలగటం మాత్రం పచ్చినిజం.

శారదకి నేనిచ్చిన వ్యధ ఎక్కువా. ఆమె నాకిచ్చిన సుఖం ఎక్కువా అన్నది రెండేళ్లుగా తూచుతున్నాను తూనిక తేలలేదు. తేలుతుందన్న నమ్మకం కూడా లేదు. తేల్చాలన్న పూనిక నన్ను ముంచుతోంది.



# క్రియ

విధికి నన్నెలా శిక్షించాలో బాగా తెలుసు.

లేకపోతే రాధా, నేనూ పక్కపక్కల నివసించవలసిన కర్మ ఏమిటి!!

నిజమే తను నవ్వలేదు. కట్టుడుపళ్లు పెట్టుకునుంటే నవ్వుండేది ఈ నవ్వు ఆ నవ్వులా ఉండదు. నాకా చూపు లేదో. ఈ నవ్వుకు ఆ రూపు లేదో. ఇప్పటికీ రాధసందడి చుట్టాలలో తగ్గలేదు పైగా పెరిగింది. అప్పటి కారణం అందమైతే ఇప్పటి కారణం ముగ్గురు మగపిల్లలు, ఓ ఆడపిల్ల. అంతా అమెరికా నివాసులు. బుష్ సరేనంటే వాళ్లు అక్కడే ఓ కోవెల కట్టి అమ్మను పూజించుకునేవారే భర్తకి చాలా సేవలు చేసిందట. ఆడవాళ్ల వెనకాల కొన్ని రకాల నిజాలు మాట్లాడుకుంటుంటారు. రాధ వయసులో ఉన్నప్పుడు కూడా అలాంటి నిజాలు ఎవరూ మాటలాడుకోగా నేను వినలేదు. శారదని నేను బాధపెట్టాను గనక - రాధ తన భర్తని బాధపెట్టి ఉండుంటే కనీసం జనం అలా అనడం వినుంటే లోపల్లోపల నాకు కాస్త తూకంగాఉండేది లేదు. అలా జరగలేదు. సందర్భం వచ్చినప్పుడు తప్ప ఆ రోజుల్లో అది నన్ను అంతగా గెలికేది కాదు. తను ఎక్కడో పిఠాపురంలో ఉండేది. నేను ఈ హైదరాబాదులో శారదను బాధపెట్టుకుంటూ జీవితాన్ని నెట్టుకుంటూ ఉండేవాడిని. గెద్దనాపల్లిలో పుట్టి పెరిగిన ఆ రోజులు ఆడపిల్లల చూపు కలిస్తే చాలు అందులో వేయి అర్థాలు వెతుక్కుని స్నేహితులతో కలబోసుకునే మగపిల్లల కాలం వేదులకృష్ణశాస్త్రీ మమ్మలని ఆవహించిన కాలం మా మెదడులను నాట్యం చేయించిన కాలం. ఆ నాట్యంలో రాధ నాకు ఏదియో అర్థమ్ముకాని భావగీతమ్ము అయింది.... ఆమె నయనంబులందు అనంతాంబరపు నీలినీడలు కనిపించేవి... ఉమర్‌ఖయాం వేదాంతమయింది.... గాలిబ్ గీతమయింది.

కులం, శాఖ, గోత్రం, వరస, స్థాయి అన్నీ అమరిన ప్రేమ గనక ఫలించడానికి అడ్డంకులు ఏమీ లేవు.

అయినా ఫలించలేదు.

కారణం విధికాదు. పోనీ మా నాన్న అందామా అంటే ఆయన నందో రాజా భవిష్యతి వాడు.

ఫలించకపోటానికి కారణం ఏమిటమ్మా అని రాధనే అడిగితే... తనకింకా పెళ్లికానపుడు - వికారమైన మొహం పెట్టి - సమాజ ఉద్ధరణ - అనేదని సూరిబావ చెప్పేవాడు. వాడికి ప్రేమ మీద చచ్చినంత గౌరవం. అది గనక ఓమారు పుట్టిందీ అంటే దానికో కారణం ఉండదట. జన్మ జన్మలకీ వదలదట. నీ సుఖమే నే కోరుకున్నా అనాలిట. వాడికనేంటి - నాకూ అంతకన్న నాలుగు ఎక్కువే ఉండేవి సిద్ధాంతాలు.

రాధ - సమాజ ఉద్ధరణ - అన్నపుడల్లా ఆ మాటని సూరిబావ నాతో అన్నపుడల్లా. అందులో రాధ మాటల్లో కచ్చ. మెచ్చుకోలు వినిపించేవి. కచ్చని దాచి మెచ్చుకోలుని వినిపించటం మిత్రధర్మమన్న సూరిబావ సంకల్పం కనిపించేది.

అలా అతను నాతో గుసగుసలాడుతున్నపుడు ఓ రోజు శారద షాకుల మీద షాకులు ఇచ్చింది.

రాధ గురించేనా గుసగుసలు - అంది ఫలహారపు పళ్లెం అందించుతూ.

వాడు నాకేసి అయోమయంగా చూశాడు.

నేనూ ఊహించనిది కావటంతో కోపం చూపించాలో, మామధ్య ఎంత అవగాహన ఉందో చూడు - అన్న ఫోజు చూపించాలో అర్థంకాక అయోమయంగా చూశాను.

'ఆ బంగారుతల్లి ఈ బంగారుకొండని నాకు దానం చేసిన దేవత' అంది. యథాతథంగా అలా అవే వాక్యాలు అందని నేను చెప్పలేను గాని నా జ్ఞాపకాలలోని ఆమె భావనను ఇముడ్చుకునే వాక్యాలు అవి.

ఆ రెండు షాకులతో శారద సరిపుచ్చలేదు.

'అన్నయ్యగారూ. ఈ చెల్లెలి మాటగా చెప్పండి. చక్కగా పెళ్లి చేసుకుని నూరేళ్లూ పసుపు కుంకుమలతో పిల్లా పాపలతో చల్లగా ఉంటేనే మా సంసారం ఎత్తిరిల్లుతుంది' అంది. ఆ - ఎత్తిరిల్లుతుంది అన్న పదం శారద వాడినదే. అది నాకు బాగా నాటుకుని ఉండిపోయింది.

'అందరూ నీలా ఉండరే ముండా ఇలామొగుడు చచ్చాడు. అబార్షన్ అయిందో చేయించుకున్నావో ఆ భగవంతుడికెరుక. నీ అన్న చెప్పాడూ... నాన్న చెప్పాడూ అంటున్నారు... వాళ్లు చెప్పారో నీకే పుట్టిందో పుట్టుంటుంది గ్యారంటీగా... రుచి చూసావు గదా... కావాలి కావాలి అనుంటుంది.... నువ్వెవడితోనైనా పోయినా పోతావని మీనాన్నో అన్నో మళ్లీ పెళ్లి తలపెట్టారు వలేసారు. నేను పడ్డాను వెర్రిమాలోకాన్ని. లోకోద్ధరణ చేసెయ్యాలని గంగిరెద్దులా తలూపి నీ మెళ్ళో మరో పసుపుతాడు కట్టాను. రాధ నీలాంటిది కాదు. మనసివ్వటానికీ మనువాడటానికీ తేడా చూడని మహోన్నత వ్యక్తిత్వం ఆమెది. అందుకే నేనింత మోసం చేసినా రెండేళ్లయినా పెళ్లి మాటెత్తనివ్వటం లేదు.'

అదీ నా మాటల సారాంశం. మరొకరు ముట్టిన శరీరాన్ని ముట్టుకోక తప్పనిసరి కావటంతో ప్రక్షాళన కోసం కాల్చిన గుర్తులు శారద శరీరం మీద శాశ్వతంగా ఉండిపోయాయి. అదీ నా జీవితకాల ప్రవర్తన సారాంశం.

అవకాశం వచ్చినపుడల్లా రాధకి చెప్పమని సూరిగాడితో నేను అన్న మాటలు ఇవి.

'ప్రేమ ఎంత పవిత్రమైనదో సమాజ ఉద్ధరణ అంతకన్న పవిత్రమైనది. బొందెతో మాత్రమే శారదతో జీవిస్తున్నాను అది కేవలం నా బుద్ధి నా శరీరానికి అప్పజెప్పిన ధర్మం నువ్వు కూడా నన్ను అనుసరిస్తే నాకు పాపప్రజ్ఞ ఉండదు.'

ఆ నా మాటల ప్రభావమో, జీవిత వాస్తవికతో - రాధకి కూడా పెళ్లయిపోయింది. అది నా మాటల ప్రభావమేనని సూరిగాడు కృష్ణశాస్త్రిలా తమకంగా అంటుంటే నేను ఎన్నడూ కాదనలేదు.

ఇప్పుడు రాధ మొగుడు లేదు. శారద లేదు. మా ఇద్దరి మధ్యా ఏదైనా ఉండే వయసు లేదు.

రాధ కూతురు కూడా అమెరికా వెళ్లిపోతూ.... తల్లిని తన ఇంటిలోనే ఉంచి, ఆమెకు

సహాయంగా మా చుట్టాలలోనే ఓ పేదచుట్టాన్ని ఏర్పాటుచేసి మరో చుట్టమైన మా అబ్బాయికి ఓ వెయ్యి అద్దె తగ్గించి పై వాటా ఇచ్చి, నా ఇంటినే కాదు నా తల్లినీ నీ చేతుల్లో పెడుతున్నానని అప్పగింతలు పెట్టింది.

ఇలా నా కొడుకూ కోడలూ కడుపులు పట్టుకుని ఆఫీసులకూ, మనవలు బాగులు పట్టుకుని బడులకూ పోతే ప్రైవేటాలో నేనూ కింద వాటాలో రాధా ఉండే శిక్ష విధించాడు విధాత. వీలున్నపుడూ... వీలు చేసుకుని కూడా రాధ సమాజ ఉద్ధరణ అని రెండేళ్లుగా అంటూనే ఉంది. అది కొంత కష్టంగా ఉన్నా కొంత ఇష్టంగా కూడా ఉంది.

కాని మావాడూ అని రాధ తీసిన దీర్ఘంప్రత్యేకమైనది.

.... ......

'ఏ సమాజాన్ని ఉద్ధరిస్తున్నాడో చెప్పు' అన్నాను విధి లేక.

లోపలికి వెళ్లి పనిలో పనిగా నవ్వటానికి తయారుగా కట్టుదుపళ్లు పెట్టుకుని మరీ వచ్చింది రాధ చేతిలో పేపరేదో ఉంది.

ఈ – మావాడూ – అన్నవాడు రాధకి తమ్ముడు వెంకటేశ్వర్లు. సి.వి.లూ అనేవాళ్లం వేళాకోళంగా. నాకన్న పదేళ్లం అంతకన్న ఎక్కువే చిన్న. సివిలు డ్రాఫ్ట్స్ మనీ సర్టిఫికెట్టు సంపాదించి కర్నాటకలో మంగళూరులో ఉద్యోగమో పనో ఏదో మొత్తంమీద అక్కడ ఉంటున్నాడు. సమాజాన్ని ఉద్ధరించే లక్షణాలు నాకు తెలిసి వాడిలో కోసినా లేవు. వాడు ఇరవై ఏళ్లకే బోల్డన్ని ముగ్గులు పెట్టి కోడిజుత్తు రోగం తగిలించుకున్నాడు వాడిని వేదులా. కృష్ణశాస్త్రీ ఏమీ చెయ్యలేకపోయారు. ఆ తర్వాత వాడు ఊజ్యుదయాడనీ, బాగా వెనకేసాడనీ అన్నారు.

ఆ పేపర్లు కన్నడంట. అచ్చం తెలుగు అక్షరాలే.అందులో వాడి ఫొటో ఉంది. కింద ఇంటర్వ్యూట. ఇంకో పేపర్లో ఏవో నినాదాల అట్టలతో వెంకటేశం ఓ గుంపులో ముందు వరసలో ఉన్నాడు.

రాధ ఈసారి నవ్వటానికి సంకోచించలేదు. అందులో గర్వం నింపటానికి సంకోచించలేదు. నన్ను నా సైజుకి కుదించటానికి సంకోచించలేదు.

'ఏంటో నాకు మాత్రం ఏం తెలుసు బావా. టీవీలన్నింటిలోనూ మా వాడేట. నేనోమారు టీవీలో చూపిస్తుంటే చూసాను ఏమిట్రా. అని ఫోను చేస్తే సమాజం పాడైపోతోందక్కా. మన కడుపుకు మనం చూసుకు బతికెయ్యటమేనా. దాన్ని బాగు చెయ్యటానికి తోచింది చెయ్యాలిగదా అంటూ ఈ పేపర్లు పంపించాడు' అంటూ వాటిని నా మొహం మీద



కొట్టింది అవి నేను చూస్తుంటే కొనసాగించింది.

'పాపం మనబోటివాళ్లం ఏం చేసినా ఎంతచేసినా రాణకెక్కదు. చెప%కునే వాళ్లే ఉండరు....'

ఇహ ఈ వెంకటేశం గాడి పేపరు ప్రతిష్ఠతో నన్ను టొకాయించి పారేస్తుందన్నమాట ఈవిడగారు అని గొణుక్కుంటూ పేపరు చాటేసుకున్నాను.

........ ...... ......

నారోజు బాగుంది. పదిరోజుల్లో నా కొడుక్కి ఏదో ట్రైనింగుట. అదీ బెంగుళూరులో. పిల్లలకి సెలవులు. కోడలికి కూడా సెలవలు మురిగిపోతున్నాయిట. దానాదీనా కర్నాటకలో తిరుగుదామని కొడుకూ కోడలూ కూడబలుక్కున్నారు. మీరు అంత దూరం వెళ్లేట్టయితే మంగుళూరు వెళ్లాల్సిందే అంది రాధ అంతటితో ఊరుకోలేదు. వెంకటేశంతో ఫోను కూడా చేయించింది. అంతటితో అవలేదు.

ఈ ముసలి ప్రాణాన్ని కూడా మోసుకుపోతామన్నారు మా వాళ్లు. చెప్పొద్దూ. నాకు ఆనందమే కలిగింది. జీవితమంతా పెళ్లాన్ని హింసించటమన్న ఎంటర్టైనమెంట్ తప్ప మరోటి ఎరగని వాడిని మా రైల్వేవాళ్లు పాసులు ఇచ్చినా, శారద ఉత్సాహపడినా. 'నీ బాబు నిన్ను పోషించటానికి ఉద్యోగం వేయించాడు. రాత్రిళ్లు నిన్ను సుఖపెట్టటమనే డ్యూటీ వేశాడు. ఇంక నీకు తిప్పుళ్లు మప్పమని నాకు చెప్పలేదు మప్పానా. మరి తిప్పలేను' అనేసి కసి తీర్చుకున్నాను గాని నాకంటూ మరో ఎంటర్టైనమెంట్ లేకుండా చేసుకున్నాను. అలవాటైపోయింది. ఎక్కడికి వెళ్లాలన్నా మనసు వెనక్కి లాగేస్తుంది అసలు ఇల్లు విడిచి వెళ్లాలంటే ఆడాళ్లకున్న సరదా మొగాళ్లకి ఉండదనుకుంటాను. అయినా ఆనందం ఎందుకు వేసిందంటే పది పదిహేను రోజులు ఎడం ఉంటే రాధమ్మ సమాజ ఉద్ధరణ ఎత్తిపొడుపులని కాస్త ఎడం పెడుతుందేమోనన్న ఆశ. చెప్పొద్దూ. లోపల మరో బెంగ ఉంది. అది భార్గవి.

.... ..... ......

వెంకటేశం నిజంగానే చాలా మంచాడు. అభిమానాలూ, ఆపేక్షలూ మనవాళ్లన్న గౌరవాలూ అన్నీ ఉన్నవాడు. ఎప్పుడు నేర్చుకున్నాడో మరి. అతగాడూ, భార్గవీ వచ్చి వాళ్లఇన్నోవా కారులో తీసుకుని పోయారు. కెవిస్‌రావు రోడ్డు మీదనుంచి పోతున్నాంట. వెంకటేశ్ తెగ వాగుతున్నాడు. అక్కడి గౌడసారస్వత బ్రాహ్మణుల గురించి వారిలో సంప్రదాయమూ, ఆధునికతా సమ్మేళనం గురించీ, పెరుగుతున్నే మాల్స్ పబ్బుల గురించి. వారివల్ల వాటివల్ల జరుగుతున్న సంస్కృతీ కాలుష్యం గురించి – అవునండీ నిజమేనండీ అంటూ మావాడూ... మధ్యమధ్యలో ఒకటీ అరా అంటున్నా మనవాళ్ల సందేహాలకే పరిమితమైపోయింది నా కోడలు. ముందుసీట్లో మావాడూ, వెంకటేశం.... వెనకసీట్లో కోడలూ, పిల్లలూ... మధ్యలో నేనూ, వెంకటేశం పెళ్లాం భార్గవీనూ...

చూసారా ఆ బిల్డింగూ.... అంటూ నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ భవనం ముందు నిలిపాడు. తిప్పి చూపించాడు. వచ్చిన కొత్తలో కొనిపడేసాడుట. ఈ రోజుల్లో డబ్బు చెయ్యాలంటే ఇళ్ల మీదే బావాముందు చూపుండాలి....లోకలాళ్ల కన్న లోకలాళ్లమైపోవాలి. కలిసి కూడా రావాలనుకో.... అందుకు మీ చెల్లాయే ఉంది ఇంటి భాగ్యదేవత.. ఐతే మనిషి ప్రయత్నం కూడా కావాలి కదా... నా పేరు కూడా వెంకటేష్ అని మార్పించేసుకున్నాను – అంటున్నాడు.

కారెక్కాక రిసెషన్ గురించి, రియాలిటీ కుదేలవటం గురించి, ధరల గురించీ, రికవరీ గురించీ మావాడి చిరుప్రశ్నలూ.... వెంకటేష్ (శం) పెను జవాబులూ – మధ్యలో ఏంటయ్యా ఏ బిల్డరు ఆత్మహత్య చేసుకున్నాడూ – అమెరికా వాళ్లని వదిలెయ్ మన దేశం గురించి చెప్పు.... అంటూ నవ్వుతున్నాడు.

భార్గవి కలగజేసుకుని మాటాడటం లేదు కాని కాస్త అప్రసన్నంగా ఉంది. వెధవ సంత వచ్చిపడిందని అనుకుంటోందేమో... నేనెరిగిన మేరకు భార్గవి అలా అనుకునే మనిషి కాదు. నాబోటి వెధవతో... అసహ్యంగానే ఉంటుంది.

భార్గవి నాకన్న బాగా చిన్నది. అపుడపుడు

పెళ్లిళ్లలో చూసాను. ఓమారు మా పాపారావు చిన్నాన్న కూతురు పెళ్లి ఓ వయసైన రెండో పెళ్లి వాడితో కుదుర్చుకుంటే తెలిసి పనిగట్టుకుని వచ్చి ఆ పిల్ల గొంతు కొయ్యవద్దని గొడవ చేసిందట. ఆ పిల్లని తనతో తీసుకుపోయి చదువూ సంధ్యా చెప్పించిందట. దాంతో మావైపు ఆడాళ్లలో కాస్త పేరు. మొదటిసారి ఆవిడని కలిసొచ్చిన ఉత్సాహాన్ని నాతో పంచుకోబోయింది శారద.

శారద ఉత్సాహాన్ని స్వయంగా దించుకునీ లోపల నేనే పూరాగా దించేశాను.

నీబోటి వెధవముండలకి బానే ఉంటాయి ఆవిడగారి ఉపన్యాసాలు. ఎవడితో పడితే వాడితో పోవటమే గదా స్త్రీ స్వాతంత్ర్యమంటే.... ప్రతి దానికీ లోపల్లోపల ఉండేదే గదా... బట్టలిప్పుకు తిరగాలని...

పడీ ఆడదాని ముందు ప్రతీ మొగాడూ పేట్రేగిపోతూనే ఉంటాడు. ఉన్న కాస్తంత సంస్కారం కూడా ఊడిచిపెట్టుకుపోయేది శారద ముందు నా క్షమానర్హమైన ధోరణి అలా ఉంచి మళ్లీ భార్గవిని కలుస్తానని గాని ఇలా పక్కపక్కన కూర్చుంటానని గాని ఎన్నడూ కలలో కూడా అనుకోలేదు. శారద నా గురించి చెప్పి ఉంటే. చెప్పే ఉంటుంది. చెప్పకుండా ఎలా ఉంటుంది. చెపితే మాత్రం తప్పేముంది. నీచుడిని నీచుడనుకుంటే తప్పేముంది. తీర్చినా తీర్చకపోయినా మనిషన్నాక చెప్పుకుంటారు. చిన్ని నమ్మకమేంటంటే చెప్పుంటే భార్గవి ఊరుకునీ అవకాశం లేదు. నా కాపురం గోయిందా అయిపోయేది.

కనీసం ఇప్పుడు నా పక్కన కూర్చునేది కాదు. కార్లోంచి తోసేసి ఉండేది. ఏమో... స్త్రీవాదుల్లో మాత్రం దయామయులుందరా... అసలు స్త్రీలే దయామయులు. లేకపోతే శారద ఇన్నాళ్లు నన్ను మోసేదా... శారద...

భార్గవి మధ్యమధ్యలో నన్ను చూస్తోంది ఏదో అనాలని అనుకుంటోందని అర్థమవుతోంది. ఈవిడ చేసిన ఏ మంచిపనికో మా వెంకటేశం గాడికి సమాజ ఉద్ధరణ బిరుదు వచ్చేసిందా.... ఆడాళ్లు చేసే మంచి పనులకు అడ్డు చెప్పకపోడం కూడా మా మగ ముండాకొడుకుల కీర్తికాతాలో పడిపోతుంది గదా- ఏమైనా భార్గవి చూపులో నాపై అసహ్యం లేదు.

నిజంగా మనం సమాజానికి ఏదో ఒకటి చెయ్యాలి గదా.... సంపాదనకేముంది కుక్కలు కూడా సంపాదించెయ్యగలవు. పేయింగ్‌బాక్ టు సొసైటీ అన్న కాన్సెప్టు ఎంతమందికి ఉంటుంది అంటూ నా కొడుకు వెంకటేశాన్ని ఎత్తేస్తున్నాడు. నా జీన్సు ఎక్కడికి పోతాయి. ఏరు దాటి తెప్ప తగలేసే నా తత్వం ఎంతో కొంత అంటుతుంది గదా... సిరి అబ్బకపోయినా చిదుము అంటుతుంది గదా.

లేకపోతే ఏంటయ్యా రాంబాబూ.... మనదేశంఎలాంటి దేశం.... మన సంస్కృతి ఎంత ఉత్కృష్టమైనదీ... కేవలం ఆడవాళ్ల పాతివ్రత్యబలం మీద ఖండఖండాంతరాలలో జైజైలు కొట్టించుకున్న దేశం అలాంటిది ఈనాడు ఆడాళ్లు తాగటమేంటి. తాగి తైతక్కలాడటమేంటి చెప్పు.... పబ్బుల్లో పడి



చిచ్చీ.

సడన్‌బ్రేకుతో కారు ఆగింది. ఎవరో జంట. తాగేసి ఉన్నారట.... గోవా వాళ్లుట వెంకటేశం అంటున్నాడు గొడవ... సారీ సారీ సుమ్మనీరు... కన్నడం వాళ్లు గొడవలు పడరట. ఎవరైనాపడితే సుమ్మనీరు... ఊరుకోండిట... అంటూ సర్దేస్తారట.

తాగేసి ఉన్నారు గుంటముండా వాడూనూ.... అసలు ఆడాళ్లు తాగటమన్నది...నీకు గుర్తుందా రాజారావు బావా... పప్పులోళ్ల పిల్ల.... అంటు మామిడితోటలో దొంగసారా బట్టీలూ... తాగి తాగి చచ్చింది ఆ మనిషి.... అంతెందుకు కల్తీసారా తాగి చచ్చేవాళ్లలో ఎంతమంది ఆడాళ్లు.... అవుతే ఏమాటకామాటే చెప్పుకోవాలి....వాళ్లంతా పాటకపు జాతి.... అలగా రకాలు... మన సంస్కృతికే వాళ్లు...

వెంకటేష్ (శం) నవ్వు తెరలు తెరలుగా...

నవ్వాగనే లేదు.... ఇల్లొచ్చేసింది

అది ఇల్లా... పెద్ద మహల్....భార్గవీ నిలయ.... కన్నడంలో... పెళ్లామంటే ప్రేమే.పోస్లే భార్గవి అదృష్టవంతురాలు.

ఇంటిముందు గేటు. ఓ సెక్యూరిటీ గార్డు. ఇద్దరు పోలీసులు. ఒకడు గేటు తీసాడు. ఒకడు కారు వెనకే పరుగెత్తుకొచ్చి కారు తలుపు తీసి పట్టుకున్నాడు వెంకటేష్. అతని భుజం మీద చెయ్యివేసి దిగుతూ - తిమ్మప్పా అంటూ కన్నడంలో - పలకరింపు కాబోలు. ఏదో మాటలాడాడు. అతను ఏదో వినయంగా చెప్పాడు. ఓ తృటి వెంకటేష్ మొహం మారింది. అంతటిలోనే ఆ పోలీసు ఏదో అనటంతో - సరి సరి - అంటూపెద్దగా నవ్వుతూ పద బావా అంటూ వత్తులు పెంచి -కన్నడం వాళ్ళకి వత్తుల పిచ్చి చూసావా రాజ్యం మనచేతుల్లో ఉంటే ఎన్ని మర్యాదలో లోపలికి తీసుకుపోయాడు.

నా మెదడులో చిన్నపుడు ఏర్పడిన ముద్ర చెదరకపోవటంతో వాడిదంతా పైపై బండారం అనే అనిపిస్తోంది - ఎవరీ పోలీసులు - అన్నాను బెరుకు దాచుకుంటూ.

అరెస్టు చేసారు గదా. ఆ మధ్య పబ్బుల్లోకెల్లి ఆడపిల్లలను తాగొద్దమా అన్నాం గదా. ఆ కేసు సిఐ వచ్చాట్ట. వీళ్లని మనకి సెక్యూరిటీ పెట్టారు ఏవో సంతకాలు కావాలిట. అంటూనే వెళుతున్నాడు. వాడి వెనకే నే పరుగెట్టాలిసి వచ్చింది.

పిల్లలు సామాన్లు పట్టించుకుని వచ్చేసరికి వాడు ఆ వచ్చిన పోలీసాయన పని చూసేసాడు. కాఫీకి టైం లేదని గాబోలు చెప్పి ఆయన వెళ్లిపోయాడు. మా ముందు జరగాల్సిన ప్రదర్శన రంజుగా జరిగినందుకు కాబోలు మావాడు మహోత్సాహంగా ఉన్నాడు ఆ రోజు రాత్రి వాడి కూతురు వచ్చేవరకూ.

.... .... .....

పిల్లపేరు ప్రసన్న. పేరుకు తగ్గ మొహం. జీన్సు పాంటూ, టీ షర్టూ, వాళ్లమ్మ లాగే కత్తిరించుకున్న జుత్తు. మొహానికీ, వేషానికీ లంకె వెయ్యలేకపోతోంది మనసు. తెలుగులో మాట్లాడాలన్న సరదా ఉంది మధ్యమధ్యలో నట్టేస్తోంది కన్నడం

ఇంగ్లీషూ వచ్చి దూరిపోతున్నాయి.

మా ఊరగా మా ఏలేరగా అంటూ మామిడితోటా... ఎన్నెన్నో అడుగుతోంది. ఏంటేంటో చెపుతోంది. నేనే మరచిపోయినవన్నీ గుర్తు చేస్తోంది మంచి పిల్ల... కానీ ఆ జుత్తూ వేషం ప్చ్....

ఆ పిల్ల రాగానే మనోడి ముహం మారిపోయింది. ఇంతసేపు ఎక్కడ తగలడ్డావ్ అంటూ అరిచాడు. ప్రసన్న ఆ మాటే విననట్లు మాతో మాటలు భార్గవి వాడిని లోపలికి తీసుకుపోయింది. వాడి గొంతు క్రమంగా తగ్గింది.

ఎవరో ముస్లిం అమ్మాయిని అల్లరి పెడుతున్న ఓ అబ్బాయి మీద కేసు పోలీసులు బుక్ చెయ్యలేదుట దానికోసం ఏజిటేషన్. అందులో పాల్గొని వచ్చిందిట కేసు బుక్‌చేసారుట. చెపుతోంది ప్రసన్న.

ఆ మర్నాడు ఉల్లాల బీచ్ పట్టుకుపోయారు ఏముంటుంది సముద్రమంటే... ఎక్కడ నుంచి చూసినా జనేం. వేలంవెర్రి హాయిగా ఏ పకోడీలో చేసుకుని తింటే సరిపోదూ ఇలా ఊళ్ళ మీద పడే బదులు.... ఏంటో డబ్బులు ములాగ్గా ఉంటే వస్తాయీ సరదాలు పుణ్యమూ పురుషార్థమూ అంటూ జన్మకో సంక్రాంతిలా వెళ్లే వారా నాటి జనం.

మర్నాడు నేను తిరగలేనని దణ్ణం పెట్టేసాను మావాడు విసుక్కుంటే వెంకటేశం సర్దేశాడు. బావ రాకరాక వచ్చాడు. ఓపిక ఉంటే వస్తాడు లేకపోతే రెస్టు తీసుకుంటాడు. నువ్వు అభిచాయత్తపడకోయ్ రాంబాబూ - అన్నాడు. వాళ్లు తిరగటానికి పోయారు. వాడికి పనులేవో ఉన్నాయిట. ఏదో మీటింగుందని మధ్యాహ్నం భోజనం టైంకి వచ్చేస్తానని మన కోసం చూడొద్దని వంటాయనకి చెపితే వడ్డించేస్తాడని చెప్పి ఆఖరున వెళ్లింది భార్గవి.

తనొచ్చేవరకూ నిద్రే నిద్ర. వస్తూనే అయ్యో భోంచేసెయ్య లేకపోయారా అన్నయ్యగారూ అంటూ ఊ తెగ ఇదైపోయింది. కొసరి కొసరి వడ్డించింది. కడువు నిండిపోయిందమ్మా నీ ఆదరణానీ సంసారమూ చూస్తుంటే అన్నాను మనసారా.

నవ్వింది భార్గవి.

'ఏమ్మా - నవ్వుతున్నావ్.. మా వెంకటేశం అదృష్టవంతుడు కాదాచక్కనైన భార్యాకూతురూ సంపాదన' అన్నాను అయోమయంగా.

'ఆ మాట ఆయన అన్నాడా'

'బావుంది తల్లీ ఎవరి గొప్పలు వాళ్లు చెప్పుకుంటారా ఏం'

'కరెక్టు చెప్పుకోరు. చూపించుకుంటారు.'

నా మనసులో మాటే అంది కాని స్వచ్ఛంగా ఆత్మీయంగా కావలసిన మనుషితో చెప్పుకుంటున్నట్టు అంది. అది గుండెకి తగిలింది.

'మా వాడికి కాస్త మందు అలవాటని విన్నాను. ఏమైనా ఇబ్బంది పెడుతున్నాడా కొంపదీసి' తోచిన కారణం అడిగాను.

భార్గవి చెపుతోంది. మంగుళూరు పబ్బు సంఘటన.... ఆడాళ్లని తరిమి తరిమి కొట్టడం.... అందులో వెంకటేశం పాత్ర. రకరకాల కారణాలతో దూసుకుపోయే మనుషులు... పార్టీ మారగానే సంస్కృతీ పరిరక్షకుల నవోత్సాహం... పాల్గొన్న వాళ్లపై కేసులు అరెస్టులు... బెయిళ్లు... వాళ్ల మీద దాడి జరగొచ్చని రక్షణలు... మీడియా అడావుడి... తనూ కూతురూ స్త్రీ సంఘాలతో కలిసిపబ్బుకు వెళ్లి నిరసన తెలపటం.

కొంత అర్థమవుతోంది. వెంకటేష్ చేస్తున్న సమాజ ఉద్ధరణ తుదీ మొదలూ.

ఏమాటకి ఆ మాటే ఒప్పుకోవాలి.తాగారని ఆడాళ్లని కొట్టడమేంటి... తప్పే అయితే మగాళ్లు తాగినా తన్నాలి. రామాయణం నాటికి మహా మహా వాళ్లే ఆడాళ్లూ మగాళ్లూ తాగేవాళ్లు. అసలు వద్దనీ ఈ వెంకటేశం మందు కొట్టని మహాయోగా....

'అన్నీ తెలిసినవాడికి ఈ పనులేమీ బాగులేవమ్మా' అన్నాను అనకుండా ఉండబుద్ధవక...

'దానికీ కారణం ఉంది అన్నయ్యగారూ... నన్నూ నా కూతురనీ తన్నలేకా... ఏదోలా పేపర్లకెక్కాలనీ...'

అంటే

చెప్పింది మగాళ్ల అల్పత్వం గురించీ వాళ్ల స్వార్థం గురించీ....

'అవుననుకో తాగటం అందులోనూ ఆడాళ్లు పాపం వెంకటేశానికి తప్పనిపించిందేమో తల్లీ' నసిగాను.

'ఆడాళ్లుతాగటం ఈయనకి నచ్చదంటారా...

'ఆ గుంపులో అందులోనే గాదు ఏ ఉద్యమంలోనైనా సిన్సియర్‌గా ఉండేవాళ్లు ఎంతమందో అంతకుమించి అందులో నాకేంటి అనుకునీ వాళ్లు చేరతారు ఆ ఉద్యమం మంచిదైనా అంతే చెడ్డదైనా అంతే...'

ఆలోచనలో పడ్డాను.

అనాదిగా ఒక జాతి సంస్కృతి అంతటి బరువూ ఆడాళ్ల మీదే మోపటం తాలూకు చరిత్ర.... మనదేశం తాలూకు హిపోక్రసీ... స్త్రీలను లక్ష్యం చేసుకున్న దాడులు మా మాట కొట్టేస్తారా అన్న మగ అహంకారం దాని వివిధ రూపాలూ...వింటున్నాను... శారదతో నా ప్రవర్తన గుర్తులతో మనసు కుంచించుకుపోతోంది.

'అన్నయ్యగారూ మీరంటే నాకు ఎంతో గౌరవం. మీకు స్త్రీలపై గల ఫీలింగ్స్ శారద గారి గురించి విన్నాక నాకు అర్థమయాయి. ఆడవాళ్ల పరిస్థితిలో ఈ నలభై ఏళ్లలో మార్పులు వచ్చాయని మీరు అనుకుంటున్నారేమో ఆర్థిక స్వాతంత్ర్యం మార్పులు తెస్తుందన్నది అర్థసత్యమే ఐపోయింది. పనివాళ్ల మార్కెట్ పెంచింది తప్ప మౌలికమైన ఏ మార్పులూ రాలేదు.బయటి పరిస్థితులతో పాటు మనిషి లోపల మార్పులకు పెద్ద ప్రయత్నం జరగవలసిందే... అంటూ చెప్పి చెప్పి....

'మారే మీవంటివాళ్లే నాలాంటివాళ్లకి ఇంకా ఆశ కలిగిస్తున్నారు' అంటూ చటుక్కున నా పాదాలు ముట్టింది.

ఒక్కసారిగా నేను పగిలిపోయాను.

నేను మహా పాపాత్ముడిని. నాకు పుట్టగతులుండవు... బొంగురుపోయిన గొంతుతో తడిదేరిన కళ్లతో ఆమెకు నమస్కరించాను.

'ఇంక ఆరు నెలలకన్న ఎక్కువ బతకదని వైద్యులు తేల్చేవరకూ బతికిన నేను వేరు. ఆ తర్వాత నా దేవత నాకిచ్చినదేంటో నేను పోగొట్టుకోబోతున్న దాన్ని గుర్తుచేస్తున్న బుద్ధి లెక్కగట్టి కన్నీటితో ఆమె కాళ్లు కడిగాను. మంచం మీదున్న ఆమె ఉచ్చెత్తాను పియ్యెత్తాను ముప్ఫై ఏడేళ్లుగా నేను ఆమెను పెట్టిన హింస. ఆకలి నా నిరుద్యోగం అధైర్యం శారదతో పెళ్లికి నన్ను పురికొలపటం... ఆ తర్వాత నాలోని రాక్షసుడు... నేనేదో పోగొట్టేసుకున్నానని కసి... కార్పణ్యం.

అన్నీ విడిచిపెట్టి అంతా బయటికి వచ్చేసి.

'సెప్పు తల్లీ... నీకింకా మా మొగజాతి మీద ఆశ ఉందా..'

తలెత్తి భార్గవిని చూసాను. అందులో ఏమున్నా ఆ చూపులు నా కళ్లలో ముళ్లు దింపుతున్నాయి వెర్రాడిలా తల వంచుకున్నాను.

కొంత సేపయాక - 'మంచినీళ్లు తీసుకోండన్నయ్యగారూ' అంది. గ్లాసు ఖాళీ చేసేను. తలెత్తాను ఇప్పుడు ఆమె కళ్లు దయా పారావారాలలా ఉన్నాయి.

'ఇప్పుడు నాకేమనిపిస్తున్నదంటే' అంటూ ఆగింది.

'ఇప్పుడు నాకేమనిపిస్తున్నదంటే' అంటూ ఆగింది.

వెర్రిగా చూస్తున్నాను. 'ప్రేరణ ఏదైనా ఫలితమేదైనా మంచి పని మంచి పనే.... చెడ్డ పని చెడ్డ పనే' అంది భార్గవి.